క్లుప్తంగా

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

మునగాల : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి బి.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్ ప్రతులు తీసుకువచ్చి కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నడిగూడెం : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్, నాయకులు బొల్లం శ్రీను, దున్నా రవి, దున్నా ప్రవీణ్, మహ్మద్ రఫీ, తంగెళ్ల లింగయ్య, చారాల వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బడిబాట



రాఘవాపురంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

మేళ్లచెరువు : మండలంలోని రాఘవాపురంతో పాటు పలు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 0– 5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, చిన్నారుల తల్లులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అందరి బాధ్యత

మునగాల : ప్రకృతి వ్యవసాయం మన అందరి బాధ్యత అని నడిగూడెంకు చెందిన సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపయ్య తెలిపారు. సోమవారం మునగాల మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఖరీఫ్ సీజన్ నుంచి ప్రతి రైతు కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఎలాంటి రసాయన మందులు వాడకుండా సహజసిద్ధ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. భూసారం పెరగాలంటే పశువుల పెంట, చెరువు మట్టి వాడాలని, జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేయాలని, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించాలన్నారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు వేపగింజలు, వేపాకు, వావిలాకు, తూడికాడ ఆకుల ద్రావణాలు, ఆవు మూత్రం, ఇంగువ, పుల్లటి మజ్జిగ ద్రావణాలు పిచికారీ చేసి సమర్థవంతంగా నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాలబిందెల నాగయ్య, పాలబిందెల కిరణ్, వేట అశోక్, గద్దం వినోద్, మండవ లక్ష్మయ్య, సిరికొండ యాదగిరి, చింతకాయల పుల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకురాలి మృతి

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు తవిటి బుచ్చమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దీంతో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ నివాళులర్పించి మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో గ్రామశాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పొట్టిపాక సైదులు, కర్నాటి మురళి, రేఖల సైదులు, తవిటి సైదులు, నరేష్, తనీష్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల దినసరి వేతనం పెంచాలి

మాడుగులపల్లి : ఉపాధి హామీ కూలీల దినసరి వేతనం రూ. 300లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం భిక్షం, గండమళ్ల రాములు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వారు పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ స్వామికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. ఏటా పథకానికి నిధులు తగ్గిస్తూ పేదలకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. పథకాన్ని రద్దు చేసి వలసలను ప్రోత్సహించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆక్షేపించారు. కార్యక్రమంలో వ్య.కా.స మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, కార్యదర్శి వెంకటయ్య, నాగయ్య, కృష్ణయ్య, వంశీకృష్ణ, శ్రీను, వెంకన్న, ఆంజనేయులు, పవన్, బిందు పాల్గొన్నారు.

అధ్వానంగా లింకు రోడ్లు



అధ్వానంగా వల్లాపురం నుంచి శ్రీరంగాపురం వెళ్లే లింకు రోడ్డు



వేణుగోపాలపురం - వీరాంజనేయనగర్ రోడ్డు ఇలా..

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీగా మార్చాలని వేడుకోలు

నడిగూడెం : మండల పరిధిలో పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా రోడ్లను బాగు చేయడంతో పూర్తిగా విఫలం అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేణుగోపాలపురం నుంచి కరివిరాల, వెంకట్రాంపురం నుంచి కాగితరామచంద్రాపురం, సిరిపురం నుంచి శ్రీరంగాపురం, వల్లాపురం నుంచి శ్రీరంగాపురం, వల్లాపురం నుంచి అనంతగిరి మండలం చనుపల్లి, రత్నవరం నుంచి రామాపురం మీదుగా కృష్ణానగర్, నడిగూడెం నుంచి మునగాల మండలం నారాయణగూడెంకు వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అసలే వర్షాకాలం సమీపిస్తుండడంతో రాకపోకలకు మరింత ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది.

కంకర పరిచారు.. నిర్మాణం మరిచారు

మండలంలోని రత్నవరం నుంచి తెల్లబల్లి, మునగాల మండలం కోదండరామాపురం గ్రామాల మీదుగా ఆకుపాముల వరకు దాదాపు 8 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు ఎనిమిది నెలల కిందట కంకర పరిచారు. కానీ నాటి నుంచి నిర్మాణాన్ని మరిచారు. అలాగే నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి గ్రామంలోకి దాదాపు రెండు కిలో మీటర్ల మేర పంచాయతీ రాజ్ శాఖ ద్వారా బీటీ రోడ్డు వేసేందుకు మూడేళ్ల కిందట కంకర పరిచి వదిలేశారు. దీంతో నారాయణపురం, రత్నవరం, తెల్లబెల్లి, కోదండరామాపురం, ఆకుపాముల గ్రామాల ప్రజలు పలు గ్రామాలకు ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. కంకర తేలడంతో రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



రత్నవరం నుంచి తెల్లబెల్లి మీదుగా కోదండరామాపురం, ఆకుపాముల వరకు బీటీ రోడ్డు వేసేందుకు కంకర పరిచి వదిలేశారు. దీంతో రోడ్డుపై కోదాడకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి.

– చుక్కా బాబూరావు, తెల్లబెల్లి

బీటీ రోడ్డు వేయాలి



రామాపురం నుంచి రత్నవరం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. పలుచోట్ల కంకర తేలింది. రోడ్డు బాగాలేక చాకిరాల మీదుగా రత్నవరం వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి రోడ్డును బీటీగా మార్చాలి.

– కొమ్ము అంజి, రామాపురం

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం



సైకిల్ మెకానిక్‌లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ మెకానిక్‌లు అఫ్జల్, సైదులును క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం క్లబ్ మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్‌రావు, క్లబ్ కోశాధికారి యూసుఫ్‌లు మాట్లాడారు. పేదవాడి వాహనం అయిన సైకిల్ ప్రస్తుతం మానవుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా మారిందని అన్నారు. సైకిల్ తొక్కడం వలన వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రతిఒక్కరూ బైక్‌లపై ప్రయాణాన్ని తగ్గించి సైకిల్ ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమప్ప ఆలయం మాజీ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, సురేష్, వెంకట్‌రెడ్డి, చిలకరాజు శ్రీను, వజ్రపు శేఖర్ తదితరులు ఉన్నారు.

మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మాంసం విక్రయదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణదారులు మాంసం వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేయాలన్నారు. ఆరోగ్యకరమైన కోళ్లు, మేకల మాంసాన్ని విక్రయించాలని, మాంసం దుకాణ పరిసరాలను బ్లీచింగ్ పౌండర్‌తో శుభ్రపరచాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన ప్లాస్టిక్ కవర్లను లేదా స్టీల్ డబ్బాలో మాంసం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జవాన్ జానీ, సైదా, బాలరాజు, లింగయ్య, అంజయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

వైభవంగా గంగాదేవమ్మ, లింగమంతుల స్వామి జాతర



పూజలు చేస్తున్న ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

సూర్యాపేట : మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో సోమవారం గంగా దేవమ్మ, లింగమంతుల స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డిలు మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జాతరలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో అభివృద్ధి చెందాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎడ్ల గంగాభవాని, వీరమల్లుయాదవ్, ఎల్గూరి వీరయ్యగౌడ్, యలగబోయిన మధుయాదవ్, కొప్పుల రాంరెడ్డి, ఎడ్ల ఉపేందర్, ఎడ్ల వెంకన్న పాల్గొన్నారు.

తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే



బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు నూకల సరళహన్మంతరెడ్డి, ఆంగోతు లలితాహాతీరాంనాయక్, బైరం బుచ్చయ్య, ధనావత్ చిట్టిబాబునాయక్, మోసిన్‌అలీ, పెండ్యాల పద్మ, వెలిశెట్టి రామకృష్ణ కట్టా మల్లేష్‌గౌడ్, కృపాకర్‌రావు, ఇలియాస్, జొన్నలగడ్డ రంగారెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎం.షోయబ్, సైదులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

అర్వపల్లి: మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన సూరారపు మహేశ్వరి ప్రసవించిన మరుసటి రోజు అకాల మరణం చెందారు. దీంతో ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన అల్లి భారతమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబానికి క్వింటా బియ్యం అందించారు. కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, నాయకులు మందడి పూర్ణచంద్రారెడ్డి, కుక్కడపు సైదులు, కుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, గంగదెరి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వెంకటాద్రి, ఉదయ్, మల్లయ్య, సైదులు, కృష్ణ, ప్రభాకర్, వెంకటయ్య, సైదులు, విఠల్, రాకేష్, లాలు, హరీష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా గిరిబాబు

అర్వపల్లి: కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామానికి చెందిన బొర్ర గిరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక కాపీని అర్వపల్లిలో సోమవారం గిరిబాబుకు డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కె. అవిలయ్య, మేకల రాంబాబు, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగయ్య మృతి తీరని లోటు

హుజూర్‌నగర్ : టీడీపీ నాయకుడు జడ నాగయ్య మృతి పార్టీకి తీరని లోటని టీఎన్‌టీయూసీ నాయకుడు శీతల రోషపతి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మగ్దూంనగర్‌కు చెందిన నాగయ్య ఇటీవల ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందారు. సోమవారం ఆయన నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మారెడ్డి, కృష్ణ, వెంకి, లచ్చిరెడ్డి, చిన్ననాగయ్య, రమాదేవి, రాజేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజమే ప్రపంచానికి మార్గదర్శి

భానుపురి (సూర్యాపేట) : సమాజంలో అసమానతలు తొలగి, సమసమాజం నిర్మాణం జరగాలంటే మార్క్సిజమే ప్రపంచానికి మార్గదర్శి అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల రెండోరోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో వర్గ పోరాటంతో పాటు కులవర్గ పోరాటాలు అనేక వేల సంవత్సరాల నుంచి ప్రజల మధ్య అంతరాలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు స్వరూప, శిరోమణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఝాన్సీ, మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, కొత్తపల్లి రేణుక, లక్ష్మీ, లలిత, కకల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో యూనిఫాంలు విక్రయించొద్దు

సూర్యాపేట : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో యూనిఫామ్, షూ, బుక్స్ వంటివి అమ్మకాలు చేయవద్దని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి కోరారు. యూనిఫామ్, షూస్, బెల్ట్, స్టేషనరీ, పుస్తకాలు వంటివి అమ్మడం నిషేధించాలని, అధిక ఫీజు దోపిడీని అరికట్టాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరిండెంటెండ్ శ్రావణ్ కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తూ పిల్లల తల్లిదండ్రుల నుండి పుస్తకాలు, టై, బెల్ట్, షూ పేర్లతో ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు అమ్మడం నేరమని సర్కులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడమర్తి భరత్, ఎస్ కె రహీం, లింగన్న పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్‌ఎస్



పార్టీ బీమా చెక్కు అందజేస్తున్న బడుగుల లింగయ్యయాదవ్

నేరేడుచర్ల : కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త మేడిపల్లి కృష్ణయ్య ప్రమాదవశాత్తు మరణించారు. సోమవారం రూ. 2 లక్షల పార్టీ బీమా చెక్కును బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా కార్యకర్తలకు భరోసాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మున్సిపల్ మాజీ చైర్మన్ చందమళ్ల జయబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, పెంచికల్‌దిన్న ఎంపీటీసీ యల్లబోయిన లింగయ్యయాదవ్, అనంత్ శ్రీనివాస్, వస్కుల సుదర్శన్, గురువయ్య, హరీష్, ఉపేందర్, రవీందర్, సతీష్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ చరమందరాజు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని రైతు వేదికలో నియోజకవర్గంలోని విత్తన డీలర్లు, వ్యవసాయ అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే విత్తనాలను విక్రయించాలని చెప్పారు. అధిక ధరకు అమ్మినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏడీఏ సంధ్యారాణి మాట్లాడుతూ.. విత్తనాల విక్రయాలకు సంబంధించి డీలర్లు ప్రత్యేక రిజిస్టర్లలో రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. సీల్ చేసిన విత్తనాల ప్యాకెట్లను విక్రయించాలని, విడిగా అమ్మకూడదని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే షాపులు సీజ్ చేస్తామని, లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తయ్య, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై రాజీలేని పోరాటం



నేరేడుచర్లలో మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి

నేరేడుచర్ల : మహిళా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసేది మహిళా సమాఖ్య మాత్రమేనని ఆ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి అన్నారు. సోమవారం నేరేడుచర్లలో జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మహిళల కోసం ఒక సంఘం ఉండాలని, ఆనాటి ప్రముఖ మహిళా కమ్యూనిస్టు యోధురాలు స్థాపించిన సంఘమే మహిళా సమాఖ్య అని అన్నారు. ఆనాడు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును సీపీఐ నాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు గీత ముఖర్జీ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలలని సమాఖ్య ఉద్యమిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లను పర్మినెంటు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకురాళ్లు నాగలక్ష్మి, సత్యవతి, శ్రావణి, సైదమ్మ, అరుణ, ఆశాబేగం, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్‌లో..

మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం

హుజూర్‌నగర్ : న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కోసం జాతీయ మహిళా సమాఖ్య పోరాటం కొనసాగిస్తుందని సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని జంగిడి సెంటర్‌లో మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు పశ్య పిచ్చమ్మ జెండా ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడి 70 వసంతాలు అవుతుందని తెలిపారు. విద్య, ఉపాధి, ఆహార భద్రత, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, సాంఘిక భద్రత పొందడంలో మహిళలు పోరాటం కొనసాగించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకురాళ్లు పశ్య మంగమ్మ, ఎస్‌కె.ఫాతిమా, కుర్ర లింగమ్మ, శ్రావణి, మునగ లింగమ్మ, పుల్లమ్మ, వీరమ్మ, వెంకమ్మ, జాన్సీ, జడ వెంకటమ్మ, మునగ మంగమ్మ, ఇందిరాల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్కాదందాను అరికట్టాలి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో గుట్కా దందాను అరికట్టాలని సామాజిక కార్యకర్తలు సరికొండ రుషికేశ్వర్‌రాజు, చిలుముల కొండల్, దేవులపల్లి కార్తీక్ కోరారు. సోమవారం గుట్కాదందాపై పోలీసులు, ఎక్సైజ్, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా గుట్కా, పాన్ మసాల, టోబాకో, నికోటిన్ వంటివి విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని, వీటిని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ సైతం విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి గుట్కా దందాను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు ప్రతి నెల తన వేతనాన్ని అందజేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించడంతో హర్షం వ్యక్తంచేస్తూ సోమవారం ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జ్ ఉబ్బపల్లి కాశయ్య ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉబ్బపల్లి సైదులు, దైద నాగరాజు, దైద గణేష్‌లతో పాటు మహిళలు తదితరులున్నారు.

బొడ్రాయికి ఎమ్మెల్యే పూజలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మండలంలోని సామగానితండాలో బొడ్రాయి మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

- ఒండ్రు మట్టితో భూమి సారవంతం
- తగ్గుతున్న ఎరువుల వాడకం
- ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడికతీత పనులు
- మట్టిని ట్రాక్టర్లతో పొలాలకు తోలుకుంటున్న రైతులు



బూరుగడ్డలో ట్రాక్టర్లలో చెరువు మట్టి నింపుతున్న ఉపాధి హామీ కూలీలు

హుజూర్‌నగర్‌రూరల్ : చెరువు మట్టితో సాగు భూమిలకు పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. నేల సారవంతం అవుతోంది. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో భాగంగా హుజూర్‌నగర్ మండల కేంద్రంతో పాటు బూరుగడ్డ, మాచవరం, శ్రీనివాసపురం, వేపలసింగారం, గోపాలపురం తదితర గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు ఒండ్రు మట్టి కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు పొలాలకు తోలుకుంటున్నారు. ఉపాధి హామీ కూలీలు మట్టిని తవ్వి ట్రాక్టర్లలో నింపుతుంటే రైతులు పొలాలకు తరలిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు సుమారు వెయ్యి ట్రిప్పులకు పైగా మట్టిని రైతులు పొలాలకు తోలుకున్నారు.

పుష్కలంగా నత్రజని, పొటాష్

ఒండ్రు మట్టిలో మొక్కలకు నత్రజని, పొటాష్, జింక్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుండగా పొటాష్ తెగుళ్లను తట్టుకునే శక్తిని ఇస్తుంది. చెలక భూములకు చెరువు మట్టి సేంద్రియ ఎరువుగా పనిచేస్తుంది. ఒండ్రు మట్టితో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుండటంతో రైతులపై ఎరువుల కొనుగోలు భారం కొంత మేర తగ్గుతుంది.



గోపాలపురంలోని పొలంలో పోసిన నల్లమట్టి

70 ట్రిప్పుల మట్టి తోలుకున్నా



నాకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పటివరకు 70 ట్రిప్పుల ఒండ్రు మట్టిని పొలాల్లో పోయించాను. పొలం చదునుగా ఉండడంతో పాటు భూసారం పెరుగుతుందనే ఉద్దేశంతో మట్టి తోలిస్తున్నాను.

– యరగాని కాశయ్య, రైతు, బూరుగడ్డ

కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాం



రైతులు ట్రాక్టర్లు తెచ్చుకుంటే కూలీలతో ఉచితంగా లోడింగ్ చేసి పంపిస్తున్నాం. వేసవిలో కూలీలందరికీ ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నాం. కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో ఉపాధి హామీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– శైలజ, ఏపీఓ, హుజూర్‌నగర్